క్లుప్తంగా

చెరువుకట్టకు మరమ్మతులు



చెరువు కట్టపై మొరం పోయిస్తున్న అధికారులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): భారీ వర్షాలకు మండల పరిధిలోని గౌతాపూర్ పెద్ద చెరువు కట్ట కుంగిపోయింది. కట్టను పరిశీలించిన తహసీల్దార్ సహదేవ్, గురువారం ఇరిగేషన్ సిబ్బందితో కలిసి మరమ్మతులు చేయించారు. కుంగిన కట్టపై మొరం పోయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సహదేవ్ మాట్లాడుతూ చెరువు కట్టను బాగు చేయించామని, కట్టపై వెళ్లే రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అర్‌ఐ సునీల్‌సింగ్, గ్రామ నాయకుడు విఠల్ పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని శాలిపేటలో నిర్మించనున్న గంగమ్మ దేవాలయ నిర్మాణానికి గురువారం మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, పోశెట్టి, పద్మారావు తదితరులు ఉన్నారు.

నానో యూరియాపై అవగాహన



రైతులకు నానో యూరియాపై అవగాహన

పెద్దశంకరంపేట(మెదక్): రైతులు ఎక్కువగా ఎరువులు వినియోగించడం వల్ల భూసారం దెబ్బతింటుందని ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి కృష్ణ అన్నారు. గురువారం పెద్దశంకరంపేటతో పాటు ఆయా గ్రామాలలో రైతులకు నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. నానో యూరియా అర లీటరు ఒక ఎకరానికి సరిపోతుందని, దీనివల్ల ఎటువంటి కాలుష్యం ఉండదన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ దీనిని క్రమపద్ధతిలో ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు మమత, అఖిల్, వినీత్ తదితరులున్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ



ఫిజియోథెరపీ చికిత్స నిర్వహిస్తున్న స్వప్న

కౌల్దారం(నర్సాపూర్): ప్రత్యేక అవసరాల పిల్లలకు గురువారం మండల వనరుల కేంద్రంలో ఫిజియోథెరపీ డాక్టర్ స్వప్న చికిత్సలు నిర్వహించారు. ప్రతి గురువారం ఫిజియోథెరపీ చికిత్స నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని ప్రత్యేక అవసరాలు పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం 8 మంది పిల్లలకు ఫిజియోథెరపీ చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

విశ్వేశ్వర ఉత్సవాలు ప్రారంభం

టేక్మాల్(మెదక్): శ్రావణమాసం పురస్కరించుకొని టేక్మాల్ మండలం దనూర గ్రామంలో వెలిసిన శ్రీ కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో శివ పంచాక్షరి అఖండ నామస్మరణ స్థానిక భజన భక్తులచే ఘనంగా ప్రారంభించారు. శ్రీ మాధవానంద సరస్వతి ఆశ్రమ ఆశీస్సులతో ప్రతి సంవత్సరం బహుళ అమావాస్య వరకు మూడు రోజులు పాటు ఈ ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి రోజు శివనామస్మరణ ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఉదయం 8 గంటలకు విశ్వేశ్వరునికి బిల్వార్చన శివపార్వతుల కల్యాణోత్సవం, హనుమాన్ మందిర్ వద్ద చిన్నారులచే హనుమాన్ చాలీసా పారాయణం ఉంటుందని తెలిపారు.

యూరియా కోసం రైతుల ధర్నా

- గంటలకొద్దీ నిరీక్షణ
- ప్రభుత్వ వైఫల్యంపై ఆగ్రహం
- సమస్య తీరుస్తామని అధికారుల హామీతో ఆందోళన విరమణ



నర్సాపూర్: యూరియా కోసం నర్సాపూర్‌లో రైతుల రాస్తారోకో

నర్సాపూర్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎదుట గురువారం రైతులు ధర్నా నిర్వహించారు. యూరియా లేదని తెలియడంతో ర్యాలీ నిర్వహించి.. రాస్తారోకో నిర్వహించారు. దీంతో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. ఎస్‌ఐ లింగం సర్ది చెప్పేందుకు యత్నించగా.. వారు ససేమిరా అన్నారు. తమకు యూరియా ఇస్తేనే రాస్తారోకో విరమిస్తామని వారు కరాఖండిగా చెప్పారు. దీంతో చేసేదిలేక మండల వ్యవసాయాధికారి దీపికతో మాట్లాడగా ఆమె ఈరోజు మధ్యాహ్నం వరకు యూరియా వస్తుందని చెప్పడంతో వారు రాస్తారోకో విరమించారు.

అదే బారులు

చిన్నశంకరంపేట(మెదక్): రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. చిన్నశంకరంపేట మండలం మడూర్ సహకార సంఘం వద్ద గురువారం పెద్ద ఎత్తున క్యూ కట్టారు. అర కిలోమీటరు మేర బారులు తీరారు. 450 బస్తాలకు గాను వెయ్యి మంది వరుసలో నిలిచి ఉన్నారు. ఒక్క రైతు నాలుగు ఎకరాలు, ఐదెకరాలు వరిసాగు చేస్తే ఇక్కడ మాత్రం రైతుకు ఒక్క బస్తా మాత్రమే ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదారు గంటలు క్యూ లైన్‌లో ఉంటే వెనక ఉన్నవారికి యూరియా దొరకడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒక బస్తా ఇప్పించండి

మడూర్ సహకార సంఘం పరిధిలోని సంగాయిపల్లికి చెందిన వికలాంగుడు చెవ్వ చంద్రం యూరియా కోసం వచ్చాడు. అర కిలోమీటరు క్యూ లైన్ చూసి తాను లైన్‌లో నిలబడలేనని నీరుగారిపోయాడు. అక్కడే ఉన్న పోలీసు దగ్గరికి వెళ్లి.. సార్ వికలాంగుడిని క్యూలైన్‌లో గంటల కొద్ది నిలబడలేను. దయచేసి ఒక్క బస్తా అయినా ఇప్పించండి అంటూ వేడుకున్నారు. కొంత ఓపిక పట్టు అని చెప్పడంతో అక్కడే కూర్చుండి పోయాడు.

రామాయంపేటలో...

రామాయంపేట(మెదక్): యూరియా సరఫరా విషయమై ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీజేపీ కార్యకర్తలు గురువారం రామాయంపేటని సహకార సంఘం కార్యాలయం ఎదుట రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు.



ఒక్క బస్తా ఇప్పించండని వేడుకుంటున్న వికలాంగుడు

డిగ్రీ కళాశాల కోసం భవనాల పరిశీలన

కొడిపల్లి(నర్సాపూర్): డిగ్రీ కళాశాల కోసం పలు భవనాలను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హుస్సేన్ గురువారం పరిశీలించారు. మండల కేంద్రమైన కొడిపల్లి డిగ్రీ కళాశాల ఇక్కడ సొంత భవనం లేకపోడంతో మూడేళ్లుగా నర్సాపూర్ చిన్నచింతకుంటవద్ద ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతుంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొడిపల్లి డిగ్రీ కళాశాల ఇక్కడే ఏర్పాటు చేసి తరగతులు నిర్వహించేందుకు అందుబాటులో ఉన్న భవనాలను అధికారులు పరిశీలించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న బీసీ హాస్టల్ భవనంతోపాటు మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కాంప్లెక్స్‌లోని పలు గదులను పరిశీలించారు. ఇక్కడ అందుబాటులో ఉన్న భవనాల విషయం కలెక్టర్‌తో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని ప్రిన్సిపాల్ తెలిపారు. త్వరలో కొడిపల్లిలో డిగ్రీ కళాశాల తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెదక్ డిగ్రీ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంజద్‌అలీ, ఎస్టీ గురుకుల ప్రిన్సిపాల్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



భవనాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హుస్సేన్

ఆయిల్‌పామ్ తోటలకు జాగ్రత్తలు తీసుకోవాలి

చిన్నశంకరంపేట(మెదక్): వర్షాలతో బొప్పాయి, ఆయిల్‌పామ్ రైతులు తగు జాగ్రత్తల తీసుకోవాలని హార్టికల్చర్ మెదక్ డివిజన్ అధికారి సంతోష్ కుమార్ కోరారు. గురువారం చిన్నశంకరంపేట మండలంలోని కొర్విపల్లి బొప్పాయితోట, ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. వర్షం తగ్గిన వెంటనే వర్షం నీరు బయటకు పంపించి వేయాలని కోరారు.

నానోతో అనేక లాభాలు



నానో యూరియా డబ్బాలతో రైతులు

కౌల్దారం(నర్సాపూర్): నానో యూరియా వాడకంతో అనేక లాభాలు చేకూరుతాయని మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమార్ అన్నారు. గురువారం రంగంపేట పీఏసీఎస్ ఆవరణలో నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ అంబిక,రైతులు పాల్గొన్నారు.

సాంకేతిక పద్ధతులు పాటించాలి



వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ పుణ్యవతి, ఏఓ రాజశేఖర్ తదితరులు

ఏడీఏ పుణ్యవతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): వ్యవసాయంలో వస్తున్న సాంకేతిక పద్ధతులు పాటిస్తే, రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు, దిగుబడి పెరుగుతోందని ఏడీఏ పుణ్యవతి అన్నారు. గురువారం వ్యవసాయ శాఖ సిబ్బందితో కలసి చిలప్‌చెడ్ గ్రామ శివారులో వరి పంటలను పరిశీలించారు. అనంతరం ఆమె రైతులకు నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. నానో యూరియా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన ద్రవరూప ఎరువు అన్నారు. దీని వినియోగంతో మొక్కల రంధ్రాల ద్వారా పోషకాలు నేరుగా మొక్కలోకి వెళ్లడం మూలంగా దిగుబడిపై ప్రభావం చూపుతుందని చెప్పారు. పత్ర రంధ్రాల ద్వారా నత్రజనిని మొక్కలు 70 నుంచి 80 శాతం సంగ్రహిస్తాయన్నారు. రసాయన ఎరువు అయిన యూరియాను మోతాదుకు మించి వాడటం వల్ల నేల కాలుష్యంతో పాటు, ఖర్చులు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్, ఏఈఓలు కృష్ణవేణి, అనిత, రైతులు పాల్గొన్నారు.

ట్రస్ట్ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే సునీతారెడ్డి, డీఈఓ రాధాకిషన్

వెల్దుర్తి(తూప్రాన్): గ్రామీణ ప్రాంత నిరుపేద విద్యార్థులు, ప్రజలకు హైదరాబాద్‌కు చెందిన శ్రీరామానుజ సేవా ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే సునీతారెడ్డి, డీఈఓ రాధాకిషన్ అన్నారు. గురువారం మండలంలోని కుకునూర్ ఉన్నత పాఠశాలలో పోలియో బారిన పడిన ఆరవ తరగతి విద్యార్థిని తేజశ్రీకి రెండు ట్రై సైకిళ్లు, కుడి చేతిని కోల్పోయిన పదో తరగతి విద్యార్థి నవీన్‌కుమార్‌కు ఆర్టిఫిషియల్ లింబ్‌ను ట్రస్ట్ తరపున అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సంపాదించిన దాంట్లో ఎంతోకొంత సమాజ హితం కోసం ఖర్చు చేయడం హర్షించదగిన విషయమన్నారు. ట్రస్ట్ ఫౌండర్ ధనుంజయ్ ఒకవైపు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూనే మరోవైపు ఉస్మానియా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యుడు కౌశిల్, ఎంఈఓ సీతారాం, ఉపాధ్యాయులు దామోదరచారి, అక్బర్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ట్రై సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే, డీఈఓ తదితరులు

ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి

డీఎస్పీ ప్రసన్నకుమార్



మాట్లాడుతున్న డీఎస్పీ

మెదక్ మున్సిపాలిటీ: ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. గురువారం మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 27న వినాయక చవితి, సెప్టెంబర్ 5న మిలాద్ ఉన్ నబీ పండుగలు ఉన్నట్లు తెలిపారు. పెద్ద విగ్రహాలు పెట్టే మండపాల నిర్వాహకులు క్రేన్‌ల సహాయంతో ముందుకు సాగాలన్నారు. వర్షాలు కురుస్తున్న తరుణంలో కరెంట్ వైర్స్‌తో జాగ్రత్తగా ఉండాలన్నారు. మండపంలో తప్పని సరిగా జాగ్రత్తలు వహించాలి. సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఫేక్ ప్రచారాలను ఎవరు నమ్మకూడదన్నారు. నిమజ్జన వేడుక అందరూ ఒకేరోజు నిర్వహించాలన్నారు. మండపాల నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న పోలీసులకు సమాచారమిస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

మండల సమస్యలు పరిష్కరించండి

పాపన్నపేట(మెదక్): మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతు బీజేపీ నాయకులు పాపన్నపేట తహసీల్దార్ సతీష్‌కు వినతిపత్రం సమర్పించారు. మండల బీజేపి శాఖ అధ్యక్షులు సంతోష్ చారి, కిసాన్‌మోర్చా అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ.. మండలంలో యూరియా కొరత తీర్చాలన్నారు. కొత్తపల్లి వాగు బ్రిడ్జి పక్కన ఇరు వైపులా రోడ్డు వేయాలని, ముద్దాపూర్ -ఎంకంపల్లి బ్రిడ్జి రోడ్డు వెంటనే పూర్తి చేయాలని, ఏడుపాయలలో సైడ్ గ్రిల్స్ నిర్మాణం ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో శానిటేషన్, మురికి కాలువలు శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షులు బీకొండ రాములు, ప్రధాన కార్యదర్శులు నాగభూషణం, లక్ష్మణ్ రావు, మల్లేశం, భాగయ్య,వడ్ల నారాయణ, శంకరయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కౌల్దారం(నర్సాపూర్): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ శ్రీనివాసాచారికి ఆ పార్టీ నేతలు వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు హరీష్ మాట్లాడుతూ.. గ్రామాల్లో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రజల తరపున పోరాడేందుకు పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రవికాంత్, ఉపాధ్యక్షుడు వేగొండ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ యూరియా కొరత లేదు

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలంలో యూరియా కొరత లేదని తహసీల్దార్ జ్ఞానజ్యోతి పేర్కొన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా యూరియాను అందుబాటులో ఉంచామని, కొందరు రైతులు సెప్టెంబర్‌లో అవసరముండే యూరియాను ఇప్పుడే తీసుకుంటుండటంతో రైతు సేవా కేంద్రాల వద్ద రద్దీ ఏర్పడుతుందని చెప్పారు. ఈ విషయంలో రైతులు సంయమనం పాటించాలని సూచించారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రమైన మనోహరాబాద్‌కు చెందిన మాసనూరి కృష్ణకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ 54 వేల చెక్కును పీఏసీఎస్ డైరెక్టర్ జావీద్‌పాషా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో శంకర్, నవీన్, వెంకట్‌రెడ్డి, నితిన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

◆ నానో యూరియా వాడండి

చిన్నశంకరంపేట(మెదక్): రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దని తహసీల్దార్ మాలతి, ఏఓ ప్రవీణ్‌కుమార్ కోరారు. గురువారం చిన్నశంకరంపేట, గవ్వలపల్లిలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. యూరియా కోసం దుకాణాల వద్దకు వచ్చిన రైతులకు నానో యూరియా గురించి అవగాహన కల్పించారు. నానో యూరియాతో ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు.

నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ ఆరా

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలో నిధుల దుర్వినియోగం ఆరోపణల విషయమై గురువారం కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆరా తీశారు. పట్టణంలో పర్యటించిన ఆయన నేరుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని రికార్డులను పరిశీలించారు. ప్రత్యేకంగా ఒక గదిలో మున్సిపల్ కమిషనర్ దేవేందర్, మేనేజర్ రఘువరణ్, ఇతర అధికారులతో మాట్లాడారు. ఎన్ని నిధులు మంజూరయ్యాయి..? దేనికెంత ఖర్చు చేశారనే విషయమై కలెక్టర్ ఆరా తీసినట్లు సమాచారం. ఇటీవల కొనుగోలు చేసిన సామగ్రి, బ్లీచింగ్ పౌడర్ బ్యాగులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.



బ్లీచింగ్ పౌడర్ బ్యాగులు పరిశీలిస్తున్న కలెక్టర్

వదంతులు నమ్మొద్దు

నర్సాపూర్: యూరియా లేదనే వదంతులను నమ్మవద్దని తహసీల్దార్ శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి దీపిక చెప్పారు. గురువారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా అమ్మకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి సరిపడా యూరియా వస్తుందని చెప్పారు. రైతులు అవసరం మేరకు యూరియా కొనుగోలు చేయాలన్నారు. వారి వెంట మండల ఆర్‌ఐ సిద్దిరాంరెడ్డి ఉన్నారు.

ఆందోళన వద్దు

కొడిపల్లి(నర్సాపూర్): పంటలకు కావాల్సినంత యూరియా ఉందని, రైతులు ఆందోళన చెందవద్దని తహసీల్దార్ కృష్ణ, ఏఓ స్వప్న తెలిపారు. కొడిపల్లి మండలంలో 18,500 ఎకరాలలో వరి పంట సాగు చేస్తున్నారని చెప్పారు. దీనికిగాను 1,624 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా.. ఇప్పటికే 1,026 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు సరఫరా చేసినట్లు తెలిపారు. మిగగా 600 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేస్తామని చెప్పారు. రైతులు ఆందోళన చెందవద్దన్నారు. సమావేశంలో ఏఈఓలు సాహితి, స్రవంతి, నరేందర్ పాల్గొన్నారు.

టోకెన్ల జారీపై ఆగ్రహం

శివంపేట (నర్సాపూర్): యూరియా కోసం రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. గురువారం రైతు వేదికలో టోకెన్లు జారీ చేయడంతో రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఒక రైతుకు రెండు బస్తాల యూరియాకు మాత్రమే టోకెన్లు ఇవ్వడం పట్ల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వరి పంటకు యూరియా అందడం చాలా అవసరమని, దీంతో నిత్యం యూరియా కోసం రైతు సేవా కేంద్రాల వద్దకు తిరగాల్సి వస్తుందని వాపోయారు.

యూరియా కొరతకు చెక్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మరో పది రోజులు యూరియా కొరత లేకుండా తగిన చర్యలు చేపట్టామని తహసీల్దార్ సహదేవ్ అన్నారు. రైతులు మోతాదుకు మించి యూరియా వాడటం వల్ల కొరత ఏర్పడిందన్నారు. త్వరలోనే యూరియా సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రశాంత్ ఉన్నారు.

పాపన్నపేటలో...

పాపన్నపేట(మెదక్): ఎరువుల కొరత ఉందన్న వదంతులు నమ్మొద్దని మండల వ్యవసాయ అధికారి నాగమాధురి కోరారు. కొంత మంది రైతులు తొందర పడి సెప్టెంబర్ మాసానికి కావాల్సిన యూరియాను ఇప్పుడే కొనుగోలు చేస్తుండటంతో, కొరత ఏర్పడిందన్నారు. రైతులు తగిన సమయంలో ,అవసరానికి అనుగుణంగా ఎరువులు వేయాలని విజ్ఞప్తి చేశారు.

యూరియా కొరత లేదు

నిజాంపేట(మెదక్): యూరియా కొరత లేదని తహసీల్దార్ శ్రీనివాస్, మండల వ్యవసాయ అదికారి సోమలింగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా కొరత ఉందని ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా దళారులను ఆశ్రయించి మోస పోవద్దన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

అల్లాదుర్గం(మెదక్): యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని తహసీల్దార్ మల్లయ్య చెప్పారు. గురువారం అల్లాదుర్గంలో ఎరువుల దుకాణం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా దొరకదనే అపోహతో సెప్టెంబర్‌కు సంబంధించిన యూరియాను ముందే కొనుగోలు చేస్తున్నారని, దీంతో కొరత ఏర్పడుతుందని తెలిపారు. పది రోజుల్లో జిల్లాకు 1500 మెట్రిక్ టన్నుల యూరియా రానునందని ఏఓ రాజేశ్ చెప్పారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి

ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి

కొడిపల్లి(నర్సాపూర్): ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి అన్నారు. గురువారం కొడిపల్లి పీఎస్ వద్ద యువకులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. వివిధ సంస్థల నుంచి వచ్చే వాట్సాప్ లేదా ఇతర మెసేజ్ లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. లాటరీ తగిలిందని ప్రలోభ పెట్టడం, లేదా ఇతర నేరాలలో ఉన్నారని చెప్పి భయభ్రాంతులకు గురిచేసి లింకులు పంపుతూ బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు కొట్టేస్తున్నారని చెప్పారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. బ్యాంక్ ఖాతా నంబర్, ఓటీపీలు ఎవరికి చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నరసింహమూర్తి పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలి

ఉద్యానవన శాఖ హెచ్‌ఈఓ వివేక్



వివేక్ వర్ధన్ రెడ్డి

నర్సాపూర్ రూరల్: వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని, ప్రభుత్వం అందించే సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖ హెచ్‌ఈఓ వివేక్ వర్ధన్ రెడ్డి రైతులకు సూచించారు. నర్సాపూర్ డివిజన్ ఉద్యానవన శాఖ హెచ్‌ఈఓగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా గురువారం ఆయన మాట్లాడారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పండ్ల తోటల పెంపకంతో పాటు కూరగాయల సాగుకు సబ్సిడీపై విత్తనాలు, నారు ఇస్తుందన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు సైతం సబ్సిడీ ఇస్తామన్నారు. పండ్ల తోటలు కూరగాయల సాగు కోసం సబ్సిడీ పై డ్రిప్, స్ప్రింక్లర్‌లు, పాంపాండ్‌లు ఏర్పాటు కోసం సబ్సిడీ ఇస్తుందన్నారు. పండ్ల తోటలు, కూరగాయల సాగుపై ఆసక్తి ఉన్న నర్సాపూర్, శివ్వంపేట, కొడిపల్లి, చిలిపిచెడు, వెల్దుర్తి మండలాలకు చెందిన రైతులు తనను సంప్రదించాలని కోరారు.

పేదల సొంతింటి కల సాకారం

- కాంగ్రెస్ నేత రాజిరెడ్డి
- ఘనంగా ఇందిరమ్మ గృహప్రవేశం

వెల్దుర్తి(తూప్రాన్): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదల సొంతింటి కల సాకారమైందని కాంగ్రెస్ నేత రాజిరెడ్డి అన్నారు. మండలంలోని ధర్మారంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంతకుముందు వెల్దుర్తి మండల కేంద్రంలో 16 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ.. వెల్దుర్తి-మెదక్ ప్రధాన రహదారి పరిస్థితిని సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లానని, త్వరలో రెండు లైన్‌ల రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మహేందర్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

గోమారం అభివృద్ధికి ప్రత్యేక నిధులు

శివంపేట (నర్సాపూర్): మండల పరిధి గోమారం గ్రామ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తానని కాంగ్రెస్ నేత రాజిరెడ్డి అన్నారు. గురువారం ‘నమస్తే గోమారం’ కార్యక్రమంలో భాగంగా.. గ్రామంలోని పలు కాలనీలో పర్యటించారు. డ్రైనేజీ, సీసీరోడ్ల నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పన కోసం రూ.50 లక్షల ప్రత్యేక నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాధవరెడ్డి, వెంకటరామిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నవీన్ గుప్తా, లక్ష్మీ కాంతారావు, కమలపూల్ సింగ్, నరసింహారెడ్డి, శ్రీనివాస్, నారాగౌడ్ పాల్గొన్నారు.



వెల్దుర్తి: ధర్మారంలో మాట్లాడుతున్న రాజిరెడ్డి, తదితరులు